**పిడుగులు వర్షించే ముందు అతి ప్రశాంతంగా ఉంటుంది ప్రకృతి. ప్రశాంతతకు ముందేమో కల్లోలం. ఇలా ఆ రెండూ ఒక దాని నొకటి తరుముకొంటూ వస్తాయి నిరంతరమూ. మరణం ఆసన్నమైనప్పుడు బ్రతకాలనే కోరికతోపాటు బ్రతుకుతాననే నమ్మిక కూడా బలంగానే ఉంటుంది, అదేమి చిత్రమో! అలాంటి సమయంలో సానుభూతి ఎంతగా మనిషిని సంతృప్తి పరుస్తుందో ఎలా చెప్పడం!**

## కుమారి మీనా

పరాభవ
దీపావళి కథల పోటీలో
మొదటి బహుమతి
పొందినది

సాయంత్రం సన్నబడుతూంది.

కరుణాకరానికి మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసేడు. తను ఏదో మేడమీద విశాలమైన గదిలో మంచంమీద పడుకున్నాడు. ఏమిటిది? గదిలో మనుషులు పడుకున్న మంచాలు ఇంకా ఉన్నాయి. అరె! నర్సులు తిరుగుతున్నారు. ఇది హాస్పిటలా? తను హాస్పిటల్లోనా ఉన్నాడు! అందుకే తనకు ఒంట్లో బాగున్నట్టు లేదు. ఛ! పిచ్చి! ఒంట్లో బాగులేదు కనకే ఇక్కడికి తీసుకొచ్చేరు. లేకపోతే ఈపరికి విజయవాడలో బాల్కనీ పిట్టగోడ నానుకుని గీతతో మాట్లాడుతూ ఉండేవాడు. కాని, రైల్లో ప్రయాణం చేస్తూంటే గుండెలో నొప్పి వచ్చింది. నిస్సహాయుడై పోయేడు. తన కెదురుగా కూర్చుని ప్రయాణం చేస్తున్న కళ్ళజోడు మాస్టారు ఆపద్బాంధవుడిలా ఆదుకుని సరాసరి ఇలా హాస్పిటలుకు తీసుకువచ్చి అడ్మిట్ చేయించేరు. అన్నట్టు ఆయనేరీ?

"మెలుకు వొచ్చిందా, బాబూ?"

ఆయనే పలకరించేరు. తను చూడే లేదు. తలవైపే ఉన్నారు. ఇప్పుడు చూసేడు. కృతజ్ఞత కళ్లకు కాంతి నిస్తుందని తెలిసింది. కళ్లజోడు మాస్టారు అక్షయ పుణ్యమూర్తిలా ఉన్నాడు.

"ఒంట్లో ఇప్పు డెలా ఉంది, బాబూ?" ప్రశ్న వేసే రాయన.

"మాస్టారూ!" కరుణాకరం కళ్లజోడు మాస్టారి చేతులు పట్టుకున్నాడు. అతని కళ్లలో నీరు తిరిగింది. "మీరు వెంకటేశ్వరస్వామివారు. మీ మేలు చచ్చి పోయినా జ్ఞాపకం ఉంచుకొంటాను."

"అవును. నా పేరు వెంకటేశ్వరస్వామే. నీ కెలా తెలుసు, బాబూ?"

"లేదు, మాస్టారూ! నాకు తిరుపతి దేవుడంటే భక్తి. ఆయన్ని మీలో చూసేను."

"దానికేముంది, బాబూ! కష్టల్లో సాటి ప్రాణికి సాయం కావటం కన్న ఈ బతుక్కి పరమార్థం ఏముంది చెప్పు? ఇక నీకేం ఫరవాలేదు. ఓ వారంలోపునే పూర్తిగా నయమైపోతుందని డాక్టరుగారు చెప్పేరు. త్వరలో నువ్వు హాయిగా మీ ఊరు వెళ్లిపోవచ్చు."

"చాలా థాంక్సు, మాస్టారూ!"

"ఎంతమాట, బాబూ! నేను మరి నా వ్యవహారమేదో ఇవాళ ఇక్కడ తేల్చేసుకుని మా ఊరు వెళతాను. నీకేం ఫరవాలేదు. డాక్టరుగారు ఉన్నారు. నేను మరి వస్తాను, బాబూ!" లేచేరు.

"మంచిది, మాస్టారూ!"

కళ్లజోడు మాస్టారు సెలవు తీసుకున్నారు.

కరుణాకరం కారిడార్ వేపు కలియచూసేడు. ఎవ రెవరో మనుషులూ, సజ్జన్లూ, దుర్జన్లూ, రోగులూ, నర్సులూ, వార్డ్‌బోయ్‌లూ అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు, ఒకళ్ల పనులతో ఒకళ్లు తిరుగుతున్నారు.

అతను తల పక్కకు తిప్పేడు. ఎడమ వైపు విశాలమైన కిటికీ ఉంది. కిటికీ బయట ప్రపంచం ఉంది. ప్రఫుల్లత ఉంది. వాటిలో అతనికి సముద్రం, కెరటాలు, నురగలు, ఒంపులు, ఓడలు, వంగిన ఆకాశం కమనీయంగా కనిపిస్తున్నాయి. దగ్గిరగా దిగువగా విన్రమంగా ఒదిగినట్టు ఊరంతా కనబడుతూంది. ప్రతి వ్యక్తికీ జీవితంలో పరిపూర్ణత కావాలన్నా, సుఖాల శిఖరాల్ని చేరాలని ఉన్నా ఇలాంటి కిటికీ ఒకటి ఉంటే చాలు ననుకున్నాడు కరుణాకరం. హాస్పిటల్లో బెంగతో దిగజారిపోయే రోగులకు ధైర్యం చెప్పి, ఆసరా నిలిచేవి ఈ కిటికీలేనేమో ననిపించింది.

కాస్సేపటికి సాయంత్రాన్ని సాగనంపి, చీకటి చిక్కబడింది.

ఎవరో నర్సు గదిలో దీపం వేసి వెళ్లింది. కరుణాకరం మనస్సు గీతను గురించి ఆలోచించింది.

దారిలో తన కీ పాడు జబ్బు రాకపోతే ఈపాటికి గీత దగ్గరికి చేరుకుని ఉండేవాడు. మామయ్య నెదిరించి మరదల్ని దక్కించుకునేవాడు. అయినా మాట కాదన డంలో తనకు స్వార్థం లేదే! తల్లీ తండ్రీ లేని తనను చిన్నప్పట్నుంచీ పెంచి పెద్దచేసినందుకు తన కెప్పుడూ మామయ్యమీద కృతజ్ఞతే ఉంది. మాటకోసం జీవితం మీదే ప్రతీకారం తీర్చుకుంటాడా? గీతకు ఇష్టంలేని పెళ్లి చేస్తాడా? వీల్లేదు. మామయ్య ఆట కట్టించాలి.

ఈ జైలునుండి విముక్తి పొందగానే వేగిరం విజయవాడ వెళ్లి గీతను దక్కించుకోవాలి. ఏమిటో? సాధారణంగా, ఉంటే యౌవనంలో గుండెకు ఏదో ఒక బాధే ఉంటుంది. కానీ, తనకు రెండు బాధలు — గుండె నొప్పి, గీత పెళ్లి.

ఇలా అనుకుంటూ ఉండగా హౌస్ సర్జన్ వచ్చి, కరుణాకరానికి పెథిడీన్ ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లేడు. అందుచేత అతను వెంటనే నిద్రలోకి జారేడు.

● ● ● ●

ఓ. పి. లో ఓపికగా కేసులు పూర్తిచేసుకుని వార్డుకు కదిలేడు డాక్టర్ పార్థసారథి.

వార్డులోకి అడుగుపెట్టి, ప్రసన్నంగా పేషెంట్సును పలకరిస్తూ కరుణాకరం దగ్గరికి వచ్చేడు. కేస్‌షీటు చూసేడు. "మీ పేరేమిటన్నారు?" పార్థసారథి చిరునవ్వులో కరుణాకరానికి ఆప్యాయత కనబడింది.

"కరుణాకరం."

"ఏం చేస్తున్నారు?"

"బెంగాల్‌లో రంగుల కంపెనీ రిప్రెజెంటేటివ్‌ని."

"బాధగా ఉందా?"

"ఏమిటి? ఉద్యోగమా?"

"కాదు."

"వ్యాధా?"

"బాధ లేనిదే వ్యాధి అనరు. మీలో ఇం కేదో బాధ చాటుగా కనబడుతూంది. అలా బాధపడకండి. మీది ప్రమాదకరమైన వ్యాధేం కాదు. ఊపిరి పీల్చండి." పార్థసారథి వంగి స్టెతస్కోపుతో గుండెలు పరీక్షించేడు. "మీ గుండె రాయిలా ఉంది."

"అంటే?"

"మీరు హృదయం లేనివారని కాదు. మీరు త్వరలోనే కోలుకుంటారని."

కరుణాకరానికి యువకుడైన డాక్టర్ పార్థసారథి ఎంతో నచ్చేడు. ముఖంలో భావాల్ని చదవడం, మాటల్లో బాధల్ని చంపడం, మనసులోంచి మాట్లాడ్డం — కరుణాకరానికి సారథిలో ఔన్నత్యాన్ని చూపెట్టేయి.

"రైల్లోకాకుండా ఇంతకుముం దోసారి ఇలా గుండె నొప్పి వచ్చిందన్నారు కదూ?"

"అవునండి, వచ్చింది. అప్పు డొక డాక్టరుగారు మం దిచ్చాక పోయింది. చాలా రోజులయింది. మళ్లా ఇన్నాళ్లకు మొన్న రైల్లో వచ్చింది."

"అవును. ఓ. పి. లో చెప్పేరు." పార్థసారథి ప్రక్క నున్న హౌస్ సర్జన్‌ను అడిగేడు. "ఈయన రిపోర్ట్సన్నీ సిద్ధం చేశారా, డాక్టర్?"

"యస్సర్! మీ రూమ్‌లో టేబిలు మీద ఉంచాను."

"దట్సాల్‌రైట్! బి ఛీర్‌ఫుల్, కరుణాకరం గారూ!" డాక్టర్ పార్థసారథి నిగర్వంగా మాట్లాడి నిష్క్రమించేడు.

కదిలి నడిచే పార్థసారథి, మెడలో స్టెతస్కోపుతో పరమశివుడిలా కనిపించేడు కరుణాకరానికి. ఇప్పు డిక కిటికీ లేకపోయినా ఫరవాలేదు అనుకున్నాడు.

పగలు గడిచింది.

చీకటి పొడిచింది.

ఏడున్నర ప్రాంతాల్లో ఏదో ఆలోచనలో మునిగి ఉండగా డాక్టర్ పార్థసారథి ఒక్కడూ కరుణాకరాన్ని చూడ్డానికి వచ్చేడు.

"హలో! గుడ్ ఈవినింగ్! ఎలా ఉంది మీ హృదయం?"

కరుణాకరం కళ్లతో నవ్వేడు.

"మీకేం ఫరవాలేదు. పొద్దుట మీ రిపోర్ట్సన్నీ చూసేను. ప్రమాదమేమీలేదు." కిటికీలోంచి బయటికి చూస్తూ చెప్పేడు.

"లేదంటారా, డాక్టర్?"

"అంటారా కాదు. అన్నాను."

"చూడండి, డాక్టర్!" సారథి చూసేడు. "ఇలా ఒక్కసారి కూర్చుంటారా, డాక్టర్! మీతో మాట్లాడాలి." కుర్చీ చూపించేడు.

"చెప్పండి." కూర్చొన్నాడు.

"చూడండి, డాక్టర్! ఇది నాకు ఊరుకాని ఊరు. ఇక్కడ నా కెవ్వరూ లేరు. ఇక్కడే కాదు. ఎక్కడైనా

# సృష్టికిరణం



నాకు నా అన్నవాళ్లంటూ ఉన్నది ఒక్కళ్లే — విజయవాడలో మా మామయ్య కూతురు."

"ఇక్కడికి పిలిపిస్తారా?"

"వద్దు, డాక్టర్! నేనిలా ఉన్నట్లు ఆమెకు తెలియకూడదు. తెలిసినందువల్ల ప్రమాదం ఉందని కాదు. ఎందుకూ తెలియడం అని. తన దసలే పిరికి మనస్సు. వచ్చి భయపడ్డంతప్ప చేసేదేంలేదు. కాబట్టే ఇక నాకు అవరా మీరొక్కరే, డాక్టర్! నేను భయంతో పసివాడిలా మాట్లాడుతున్నాననుకోకండి. మీతో ఇలా చనువు తీసుకుంటున్నందుకు మరోలా భావించకండి."

"నో, నో!" అదే. చిరునవ్వు.

"ఆమెకి ఉత్తరం వ్రాస్తాను. చెప్పండి, డాక్టర్! నేను బ్రతుకుతానా?"

"బలేవారే మీరు! నా మాటమీద నమ్మకం ఉంచండి. మీరు త్వరలోనే కోలుకుంటారు. ప్రాణం గురించి ఇప్పుడు ప్రసక్తే అనవసరం."

"అది కాదు, డాక్టర్! నేను బ్రతికేటట్లయితే 'నిన్ను దక్కించుకుంటా'నని ఉత్తరం వ్రాస్తాను. చనిపోయేటట్లయితే 'నా గురించి ఆలోచనలు వద్దు. జన్మ ఇచ్చిన తండ్రి మాట జవదాటకు' అని వ్రాస్తాను. చెప్పండి, డాక్టర్?"

పార్థసారథి నోటి వెంట నవ్వు రాబోయి ప్రశ్న వచ్చింది. "అదేమిటి? మీ ఇద్దరి పెళ్లి మీ మామయ్యకు ఇష్టంలేదా?"

"లేదు, డాక్టర్. మూడేళ్లక్రితం మామయ్య నెదిరించి ఇంట్లోంచి వెళ్లిపోయాను. పెద్ద కారణమేమీ లేదు. చిన్నప్పుడే తలిదండ్రుల్ని కోల్పోవడం వల్ల మామయ్యే నన్ను పెంచి పెద్ద చేశాడు. ఒక రోజు నేను చదువు ఆపేసి ఏదైనా ఉద్యోగం చేస్తానన్నాను. ఆయన వద్దన్నారు. పై చదువులు చదివి పెద్ద ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి ప్రయోజకుణ్ణవమన్నాడు. కాని, నాకాయన చెప్పింది ప్రయోజకత్వంలా కనపడలేదు. నేను వినలేదు. మొదటిసారిగా మామయ్య మాట కాదన్నాను. ఆయనకు నేనంటే ఇష్టం పోయింది. ఇంట్లోంచి వచ్చేసి కలకత్తాలో ఉద్యోగంలో చేరాను. ఏమీలేదు, డాక్టర్! నా కాళ్లమీద నిలబడే శక్తి నాకు వచ్చాక, నా కింకా మామయ్యమీద ఆధారపడి బ్రతకడం ఇష్టం అనిపించలేదు." ఒక్కక్షణం చెప్పడం ఆపుచేసి, బుగ్గమీద వేలితో గోక్కుని మళ్లీ అన్నాడు: "ఇల్లు వదిలేస్తూ, 'త్వరలోనే తిరిగొచ్చి నిన్ను నాదాన్ని చేసుకుంటాను' అని మా మరదలికి ధైర్యం చెప్పి వచ్చేశాను. కాని, కూతురి ఇష్టానికి వ్యతిరేకంగా తనిప్పుడు పెళ్లిప్రయత్నాలు జరుపుతున్నాడని అనుకోకుండా హఠాత్తుగా మా ఊరి మిత్రుడిద్వారా తెలిసింది. ఇడియట్ కాకపోతే మే మిద్దరం ప్రేమించుకున్నాక మళ్లీ కూతురి ఇష్టాన్ని మరలించే ప్రయత్నాలేమిటి, చెప్పండి? అందుకే వెంటనే బయల్దేరాను. దారిలో ఈ జబ్బొకటి దాపురించింది." ఒక నిట్టూర్పు విడిచి వ్యగ్రంగా అన్నాడు: "ఇప్పుడు నే చనిపోతే నాకోసం ఏడ్చేవాళ్లెవరూ లేరు." కరుణాకరం కంఠం గద్గదమైంది.

పార్థసారథికి జాలివేసింది. "నా మాట నమ్మండి. నాలుగైదు రోజుల్లో మీరు మామూలు మనిషైపోతారు."

"అయితే ఆమెకు 'నేను త్వరలోనే వస్తున్నా' నని ఉత్తరం వ్రాయమంటారా?"

"తప్పకుండా వ్రాయండి. నాలుగైదు రోజుల్లో మీ మరదల్ని మీరు కలుసుకుంటారు."

"చాలు, డాక్టర్! నా కీ ధైర్యం చాలు."

"ఆఁ! ఇక రెస్టు తీసుకోండి. ఎక్కువగా ఆలోచిస్తూ నిద్ర పాడుచేసుకోకండి. నే వస్తాను."

"గుడ్ నైట్, డాక్టర్!"

"గుడ్ నైట్!" డాక్టర్ పార్థసారథి లేచి వార్డులోంచి బయటికి నడిచేడు.


గీతకు ఉత్తరం వ్రాయడమా? మానడమా? వ్రాస్తే కంగారుపడుతుంది. 'ఎందుకూ? నాలుగు రోజుల్లో తనే గీతను కలుస్తున్నప్పుడు ఉత్తరం అనవసరం అనుకుంటూండగా కరుణాకరానికి నిద్ర పట్టింది.

• • • •

రెండు రోజులు గడిచేయి.

రోజూ డాక్టర్ పార్థసారథి వచ్చి కరుణాకరానికి శ్రద్ధగా చికిత్సతోపాటు ధైర్యాన్ని కూడా ఇస్తున్నాడు. కరుణాకరానికి సారథిలో కూడా వెంకటేశ్వరస్వామి కనిపించేడు.

'తనకు ఎంత ధైర్యం ఇస్తున్నాడు! రోగికి కావలసిన మందు కంటె మహత్తరమైన గుణాన్ని ఇచ్చే శక్తి సారథిలో ఉంది. తను బ్రతుకుతానన్నాడు. తన గీతను కలుసుకోగలనన్నాడు. నిజంగా తను బ్రతుకుతాడా? డాక్టరు చెప్పింది నిజమేనా? ఏమో? డాక్టర్లంతా అలాగే చెబుతారు. బ్రతుకుతావని చెప్పక, చచ్చిపోతావని అశుభం చెబుతారా ఎవరేనా? తన పిచ్చిగాని. ఏమో! అనుమానంగా ఉంది. ఇవాళ నిన్నటికంటె అస్వస్థతగా ఉంది గుండెలో. అసలు గుండె జబ్బు వచ్చినవాళ్లు బ్రతకడం కష్టమంటారు. కష్టమేమిటి? నిజం తనకు తెలీదూ? నెహ్రూగారు, లాల్ బహదూర్ శాస్త్రిగారు ఎలా పోయారు? సామర్సెట్ మామ్, క్లిఫ్టు మాంట్ గోమెరీ ఎలా పోయారు? గుండె జబ్బు —గుండె జబ్బు. అంతవరకూ ఎందుకూ? నిన్న పక్క బెడ్డుమీద చేరిన మనిషి ఇవాళే డిస్చార్జి అయ్యాడా అనుకున్నాడు. కాని, అతడి మృతదేహాన్ని డిస్చార్జి చేశారని తెలిసింది. కారణం అడిగితే 'గుండె జబ్బు' అని సిస్టర్ చెప్పింది. తనకు చావు తథ్యమని ఇన్ని బలిష్ఠమైన తార్కాణాలు కనపడుతూంటే ఇంకా తను బ్రతికే దేమిటి? అబద్ధం! తను బ్రతకడం అసత్యం. డాక్టరు చెప్పింది అనృతం. చేసింది మోసం. చేసేది మోసం. కాదు; పాపం, వృత్తిధర్మం. కళ్లజోడు మాస్టారు చెప్పిందీ అబద్ధమే. ఎంతపని చేసేడు! వెధవ చత్వారం జోడొకటి తగిలించుకుని తగుదునమ్మా అంటూ తారసపడ్డాడు. సహాయం అంటూ సహారాలోకి తెచ్చి వదిలేసేడు. ఇప్పుడు తనిక్కడ దిక్కులేని చావు చావబోతున్నాడు. అసలు రైలు దిగకుండా ఉండి ఉంటే, కనీసం ప్రాణాలు విడిచే ముందైనా తన



దివ్యదరహాసాలు

ఫోటో — ఎస్. మురళీధర్ (విజయవాడ)

గీత నొకసారి చూసుకుని ఉండేవాడు. పోనీ, ఇప్పుడు ఉత్తరం వ్రాస్తే వస్తుందేమో! తప్పకుండా వస్తుంది. కాని, వచ్చి ఏం చేస్తుంది? తన బావ తన కళ్ల ముందే దిక్కులేని చావు చావడం కళ్లారా చూస్తుంది. మతి చెదిరి తనుకూడా గుండె పగిలి చస్తే! అమ్మో! ఇంకేమన్నా ఉందా? తన గీత గుండె పగిలి చావడమే! ఊహించడానికే భయంగా ఉంది. వద్దు. తను ఉత్తరం వ్రాయకూడదు. రాలిపోయే తన ప్రాణం నిశ్శబ్దంగా అడవిలో ఎండుటాకు రాలినట్టు రాలి పోవాలి. అంతే.

వెంకటేశ్వరస్వామి తనకు మోక్షం ప్రసాదిస్తే బావుణ్ను! గీతను ప్రసాదించేడు. గుండెజబ్బును ప్రసాదించేడు. చావును ప్రసాదిస్తున్నాడు. మోకాన్నెందుకు ప్రసాదించడు? తప్పకుండా ప్రసాదిస్తాడు. దేవుడు దయామయుడు. అనంత కరుణా విభవుడు. ఈ ప్రాణం శాంతంగా సెలవుపుచ్చుకుంటే బాగుణ్ను. కానీ ఏదో బాధ మనస్సును పట్టుకుని వేళ్లాడుతూంది. ఏమిటి? గీతా? కాదు. గీత ఆలోచన తనిందాకే ఖాయపరుచుకున్నాడు. మరేమిటి? ఆఁ. డాక్టరు పార్థసారథి చెప్పిన అబద్ధం. ఎందుకు? ఎందుకలా అబద్ధంచెప్పి తన్ను వంచించాలని ప్రయత్నిస్తున్నాడు? డాక్టరుగా తన ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడా? అయినా తనకీ మూడురోజుల్లో మంచి మిత్రుడయేడే! తన మనసంతా అతనికి విప్పిచెప్పేడే! గీత గురించీ, తన ప్రేమగురించీ అంతా తెలియజేసేడే తను! గీతకు ఉత్తరంకూడా వ్రాయమన్నాడు. తప్పకుండా బ్రతుకుతావన్నాడు. ఏమో! ఒకవేళ డాక్టరు చెప్పింది నిజమేనేమో? ఏమైనా ఇవాళ సారథి రాగానే అడిగి అసలు సంగతి నిర్ధారించుకోవాలి—కిటికీవేపు చూస్తూ కరుణాకరం ఇలా తనలో తనే అనుకుంటూ ఉండగా, డాక్టరు పార్థసారథి "గుడ్ మార్నింగ్!" అంటూ తన దగ్గరికి వచ్చేడు. గుండీలు విప్పి గుండెలు పరీక్షిస్తుంటే కరుణాకరం మాట్లాడేడు.

"డాక్టర్! పదేపదే పాత ప్రశ్నే అడుగుతున్నందుకు మీకు విసుగు కలగచ్చు. కాని నాకు నిజం కావాలి. మిమ్మల్ని డాక్టరుగా భావించి అడగడంలేదు. ఒక ఆప్తమిత్రుడుగా అనుకుని అడుగుతున్నాను. ఆఖరిసారిగా అడుగుతున్నాను. దయచేసి ఒక్కసారి నా కళ్లలోకి చూసి ధైర్యంగా నిజం చెప్పండి. నిజం చెప్పి ధైర్యాన్నివ్వండి."

కరుణాకరం మాటలన్నీ పార్థసారథి చిరునవ్వుతో చూస్తూ, మౌనంగా విన్నాడు. 'పిచ్చి కరుణాకరం గారూ' అన్న భావంతో, పసిపిల్లవాడి తల నిమిరినట్టు కరుణాకరం తల నిమిరేడు. "చూడండి, కరుణాకరం గారూ! నా మాట నమ్మండి. డాక్టరుగానూ, స్నేహితుడుగానూ, సన్నిహితుడుగానూ నే చెప్పేది నిజమే. మీరు తప్పకుండా కోలుకుంటారు. అనవసరంగా మనసు పాడుచేసుకోకండి. విశ్రాంతి తీసుకోండి" అని కరుణాకరానికి కావలసిన ధైర్యం ఇచ్చి కదిలి వెళ్లేడు డాక్టరు పార్థసారథి.

పార్థసారథి వెళ్లగానే మళ్లీ కరుణాకరంలో ఆలోచనలు చెదిరేయి. ఇప్పుడు తనలో ధైర్యం సమకూడింది. దైన్యం నశిసిపోయింది. తన ముందుజీవితం మీద కొత్త ఆశలు, కోరికలు చిగురిస్తున్నాయి.

# స్పృష్టికిరణం

మనసిప్పుడు వసంతంలా ఉంది. మరి గీత ఎలా ఉందో! త్వరగా వెళ్లాలి. ఇక తను బ్రతకడంలో అనుమానం లేదు. పాపం! కళ్లజోడు మాస్టార్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాడు తను. ఎంత ఉదారుడాయన! తనకెంత చేసేడు! రైల్లో పరిచయానికి ఎంత ప్రతిఫలం ప్రసాదించేడు! అది ప్రతిఫలం కాదు. ప్రగాఢమైన మానవత్వం. ఎంతో పెద్ద ఎడారిలో, దాహంతో ఎండిపోయే వ్యక్తికి దప్పిక తీర్చినట్టు తోడ్పడిన కరుణామయుడు. ఆయన ఋణం తనీ జన్మలో తీర్చుకోలేడు. ఆయన ఋణమేకాదు, డాక్టరుదీనూ. తన జీవిత భవిష్యంలో సౌధాలకు మంచి పునాదులు నిర్మించేడు. మెత్తటి మాట, మెత్తని చెయ్యి, మెత్తటి నవ్వు, చల్లని చూపులు — పార్థసారథి డాక్టర్ వెంకటేశ్వరస్వామి—

* * * *

పక్కమీద పడుకున్న పార్థసారథి మనస్సు పాముల పుట్టలా ఉంది.

"చిరంజీవి డాక్టరు పార్థసారథికి—

వయస్సులోనూ, అనుభవంలోనూ నీకంటే పెద్దవాణ్ణయినా, ఇప్పుడు నీకంటే ఎన్నో రెట్లు చిన్నవాణ్ణయి నన్ను క్షమించమని అర్థిస్తూ వ్రాస్తున్నాను. ఇన్నాళ్ల బ్రతుకులో నేను చేసిన ఒకే ఒక పెద్ద తప్పుకి నిన్ను క్షమాపణ అడుగుతున్నాను. అంధకారంలో మునిగి చేసిన ఒక తప్పును వెలుగు చూసేక సరిదిద్దుకోడానికి మరో తప్పు చేయడంలో తప్పు లేదనుకుంటాను. నా మనసిప్పుడు చిక్కుల్లో ముడిపడిపోయింది. జరిగింది చెప్పి మనశ్శాంతి పొందాలని ఆరాట పడుతున్నాను. మా అమ్మాయి గీత నా మేనల్లుడు కరుణాకరాన్ని ప్రేమించింది. అయినా చిన్నప్పుడే వాళ్లిద్దరికీ స్థిరపడింది. కాని పెంచి పెద్ద చేసిన నన్నూ, నా మాటలనూ కాదని వాడు ఎంతో దూరంగా వెళ్లిపోయేడు. వాకబు చేస్తే కలకత్తాలో వాడేదో రంగుల కంపెనీలో చేరినట్టు తెలిసింది. వాడంటే ఇష్టపడక, అమ్మాయి మాట కాదని నీతో గీతపెళ్లి నిశ్చయించి పెద్ద తప్పు చేసేను. కాని అది విపరీత పరిణామానికి దారితీసింది నిన్న గీత ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. భగవంతుడి దయవల్ల ఎలాగో యాతనపడి నా ఒక్క కూతుర్ని దక్కించుకోగలిగేను. నాయనా, సారథీ! చేసిన తప్పుకి ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నాను. అమ్మాయి ఇష్టప్రకారమే పెళ్లిచెయ్యాలని నిశ్చయించుకున్నాను. నీ కిప్పుడు నిజం తెలుసు. నా పరిస్థితిలో ఉంటే నువ్వుకూడా ఇలాగే చేస్తావని తెలుసు. దయచేసి నన్ను క్షమిస్తావని నమ్ముతాను.

క్షంతవ్యుడు,
జానకిరామయ్య."

—అని వ్రాసిఉన్న ఉత్తరం పక్కనున్న టీపాయ్ మీద పడి ఉంది. అప్పుడే ఆ ఉత్తరాన్ని చదివిన పార్థసారథి మనస్సు ఆలోచనల తాకిడికి అలిసిపోయి ఉంది. పరిపరివిధాల పోయింది. తను చేసుకోబోయే పెళ్లి తప్పిపోయినందుకు సారథి బాధపడలేదు. గీత తప్పిపోయే పెళ్లి చేసుకోబోతున్నందుకు బాధపడ్డాడు అయినా జీవితం ఒక ప్రవాహం లాంటిది. ఆగి చూసేందుకూ, ఎదురు నిలిచేందుకూ వీలులేదు. చేయగలిగిందల్లా ఒక్కటే—అందులోపడి కొట్టుకుపోవడం అనుకున్నాడు. కరోనరీ త్రాంబోసిస్ వచ్చిన కరుణాకరం ఎలాగూ చచ్చిపోతాడని తనకు తెలుసు. కాని ఉపద్రవానికి ముందే మహోపద్రవం జరిగి జాలినిండిన మనస్సు నీరయిపోతూంది. సారథి ఇక ఒక్కటే నిశ్చయించుకొన్నాడు. కరుణాకరం చచ్చిపోయేవరకూ తృప్తిగా బ్రతకాలి. గీతను గురించి అతన్ని సమస్యలు వేధించకూడదు. ఇప్పుడు ఉత్తరంలో విషయం తెలియజేస్తే ఎంతో సంతోషిస్తాడు. తృప్తితో తాదాత్మ్యం చెందుతాడు—అనుకుంటూ సారథి లేచేడు.

దుస్తులు మార్చుకున్నాడు.

నగరమంతా రాత్రి చిండి ఉంది.

ఆకాశంలో నక్షత్రాలు, చీకట్లో దీపాలు మెరుస్తున్నాయి.

అప్పుడే వర్షం కురిసి వెలిసింది.

బీచ్‌రోడ్డులో కారులో డాక్టరు పార్థసారథి ఒక్కడూ కరుణాకరాన్ని చేరాలని కంగారుగా డ్రైవ్ చేస్తున్నాడు. కెరటాల హోరులో కారు చప్పుడు వినిపించడం లేదు. అతని మనస్సులో మహారణ్యం తగులబడుతూంది.

కాస్సేపటికల్లా కారు హాస్పిటల్ చేరింది.

డాక్టరు పార్థసారథి కరుణాకరం గదిలోకి కంగారుగా అడుగుపెట్టేడు. కరుణాకరాన్ని చూసేడు.

కరుణాకరం తల పక్కకు తిప్పి, కిటికీలోంచి చీకటిగా ఉన్న ప్రపంచంలోకి ఆశగా దేన్నో వెదుకుతున్నట్టు, గీతకోసం బెంగ పెట్టుకున్నట్టు చూస్తున్నాడు.

సారథి సంతోషంతో గబగబా చెప్పేడు: "మీరు అదృష్టవంతులు, కరుణాకరంగారూ! మీ సమస్య తీరిపోయింది. మీ మామయ్య మీ పెళ్లికి అంగీకరించారు. ఇదుగో, ఈ ఉత్తరం చూడండి"—సారథి ఆగేడు.

కళ్లువిప్పిన కరుణాకరం, కదిపినా కళ్లు తిప్పలేదు! ★

శిరోజాలంకారం

చిత్రం – జి. ఎల్. నరసింహన్ (బెంగుళూరు-3)

